# ఫలశ్రుతి

"విహారి"

శ్రీవారు సంధానపురానికి విజయం చేశారు. వూరంతా వొక్కసారిగా కళకళ్ళాడిపోయింది. అర్థశతాబ్దం తర్వాత ఆవూరికియిదే మొదటిసారి అదృష్టం పట్టడానికి. బహుశా చివరిసారికూడా అదేనేమో!

బాబూరావుగారి లంకంత యింట్లో బస. మామూలుకంటే అధికంగా, పూజలు, సమారాధన్లూ, వుత్సవాలూ, వూరేగింపులూ ప్రారంభమయ్యాయి. స్వయంగా వుద్దండమైన పండితులనీ. అయిదారు భాషల్లో మంచి నీళ్ళ ప్రాయంగా వుపన్యాసమూ, కవిత్వమూ చెప్పగలవారనీ, ఆంగ్లభాషలోకూడా అక్షరాల్ని సంపాయించిన తర్వాతనే వొదిలారనీ, వొక్కోసారి సమాధిలో కూచుంటె గంటల కొద్దీశరీరంమీద స్మృతెవుండదనీ అదో విడ్డూరంగా చెప్పుకోసాగారు లోకులు. యివన్నీ ప్రత్యక్షంగా చూడాలంటే సాన్నిధ్యం తప్పక వుండితీరాలి. యీ క్రాపుడు హెడ్డుకూ దానికీ, స్వర్గానికీ పాతాళానికీవున్నంత దూరం కాబట్టి అది అసంభవమైపోయింది, కాని తాము స్వయంగా సర్వసంగ పరిత్యాగైనా లోకసంగ్రహార్థం, అంటే మూఢజనులు కోసం పెట్టుకున్న వో యేనుగా, రెండు గుర్రాలు, వో లొటిపిటా, వో బగ్గీ, రెండు 'శకటాబండ్లూ', వోఫస్టాసు ఫైవ్‌సీటరు న్యూమాడల్ కారూ, ఖజాంచీ, పరిమెనెంటు శిష్యవర్గమూ మాత్రం చర్మ చక్షుస్సులకి కనబడ సాగాయి. మిమిమం పటాటోపమే యింతవుంటే మూల విరాట్టు సంగతి యేమనుకోవాలి? సేవించుకొని తరించడానికి యిలాంటి అవకాశం కాకతాళీయంగా వొచ్చిపడితే యే తెలివి తక్కువ దద్దమ్మ శిద్ధాన్నంలో దుమ్ముపోసుకుంటాడు?

సాధారణంగా ప్రతివూళ్ళో యెందుకైతె రెండు పార్టీలుండటం సహజం. అదో నాగరికతా చిహ్నమంటే అతిశయోక్తి కాదు. 'వుదరనిమిత్తం బహుకృతవేషం' ముఖ్యంగా వుండే రోజుల్లో అదో సహజ సౌందర్యమూ కూడా! యీ రెండూ "యతీ-అంటే — ప్రతీ" అని అనుకుంటుంటాయి. పరమార్థంవున్నా లేకున్నా వొకరు నందులకు పెడితే మరి కొందరు పందులకు పెట్టడం దానివిధి. కాని యీవూళ్ళో సహజంగా రక్తపిపాసలేకుండా యేర్పడ్డ పార్టీలు రెండూ శ్రీవారి సన్నిధానంలో అవకతవకలన్నీ మరిచి, వొక్కముఖంగా పారాయి. ఆధునికుల్లో నాస్తికవాదులెక్కువ. అయినా యింగిలీషులో జటాంతస్వాధ్యాయి అయినందున వారందరు శ్రీవారికి 'దాసోహం' అన్నారు. అధునికేతరులు కూడా శ్రీవారికి 'చతుస్సాగర పర్యంతం' చెప్పారు. కారణం—యింగ్లీషు యింత చదివికూడా ప్రపంచంవేపుపోక వేదశాస్త్రాలు కరతలామలకం చేసుకొని, లోకోద్ధారంకోసం సర్వసంగపరిత్యాగం చెయ్యడం, యిందులో కూడా యెవరికుండే స్వార్థం వారికి లేకపోలా. శ్రీవారిదగ్గర తమపక్షానికే విజయం అని వీరూ. తమపక్షానికే విజయం అని వారూ బుజాలు యెగరవేసి వొక్కదార్లో పడ్డారు. మొత్తానికి అందరికీ గురుత్వం కుదిరింది.

శ్రీవారు యింకా పాపులర్ కావడానికి మరీ ముఖ్యకారణాలు కూడా వున్నాయి. ఒకటి:...'దినరోజూ' జరుపుతుండే ధర్మసభలు. రెండు:—కేవలం జ్ఞానమార్గానికే కాక భక్తిమార్గానికికూడా అత్యధిక ప్రాముఖ్యం యివ్వడం.

1. సభల్లో ధర్మోపన్యాసాలకంటే కొన్ని పత్రికల్లో మాదిరి ప్రశ్నోత్తరాలకు అధికాధికావకాశం కల్పించి, శ్రీవారు వో నూతన శకాన్ని లేవదీశారు. మొదట్లోనే "నన్ను మీరు గురుస్థానంలో వుంచి చూడవద్దు; నన్నూకూడా మీలో వొకర్నిగా అనుకోండి. మత ధర్మవిషయాల్లోగాని, తదితర సందర్భాల్లోగాని మీకున్న సంశయాలన్నీ వివరించండి. సాధ్యమైనంతవరకు శాస్త్రీయంగా సమాధానాలు చెప్పడానికి సిద్ధంగా వున్నాం," అని శెలవిచ్చారు. యిది చాలా నూతనంగా వుంటంవల్ల సభలు యెప్పుడూ కిటకిటలాడుతుండేవి, యిసకవేసినా రాలకుండా. "స్వామీ! రోజుకు యెన్నిసార్లు స్నానం చెయ్యాలి? శౌచసమయంలో యజ్ఞోపవీతం యెందుకు చెవుకి చుట్టుకోవాలి? పూజాసమయంలో దీపం యేవేపుండాలి? శిఖ గోపాదమంత వుండాలంటారే యింగ్లీషుమానంలో దాని కచ్చితమైన కొలత యెంత? మానవునికి నీతిముఖ్యమా భక్తి ముఖ్యమా? శాస్త్రాచారం ముఖ్యమా—

ప్రాంతాచారం ప్రాధాన్యమా? యీలాంటి ప్రశ్నలు వేలకొద్దీవడుతూవొచ్చాయి. శ్రీవారు సావకాశంగా అన్నిటికీ జవాబు యిస్తుండేవారు.

2. భక్తిపక్షంలో భజనసమావేశం స్థాపితమైంది. సర్వులు వీరు వారనే భేదం లేకుండా దాంట్లోచేరి, ముక్తికి అవకాశం యేర్పరుచుకున్నారు. యిది సర్వసులభ మార్గంగదా!

యీ రెంటివల్లా శ్రీవారు అందరి మనస్సుల్లో నిలిచిపోయ్యారు, యిలాంటి వసతులూ, అవకాశాలూ యితరత్రా వుండకపోవడమే దీనికి కారణం. అయితే యివ్వన్నీ నీకు యెలా తెలుసు? అంటారు. నేను మాత్రం యింతవరకూ నాయీకళ్ళతో ప్రత్యక్షంగాచూళ్ళా. కాని యిరుగుపొరుగువారూ, వూళ్ళో జనం చెప్పుకుంటుంటే విన్నా. ఆ తర్వాతనే నేనుకూడా "అయినా వెళ్ళొద్దాం, తప్పేముంది?" అనుకొని బయలుదేరా.

ఆరోజు 'మంగళవారం' సాయంకాలం నాలుగున్నర అయివుంటుంది. సభకివెళ్ళా. శ్రీవారి సన్నిధానం కాబట్టి యేమీ ఆక్షేపించకూడదుగాని, విధేముంది? సభంతా చూతును గదా! 'అంగనా మంగనా మంతరేమాధవం' గావుంది. అదికూడా నిజమే. యిలాంటి సందర్భాల్లోకూడా మానవజన్య కుటిలభేదాలు పెట్టుకుంటే వాడు యింక తరించేదెన్నడు!— ప్రశ్నోత్తరాలు జరుగుతున్నాయి. అంతకు ముందు [illegible]. కాని అప్పుడే కిష్టాప్రివులేచి నిలబడ్డాడు సందేహాలు నివారణచేసుకోడానికి. అతడో అసహాయవాది, కొంచెం రిఫార్మరూ, అనేవాడు క్కంటే దంబాచారీ—పేరుకోసం పాకులాడేవాడూ—నాస్తికుడూ, కర్మచండాలుడూ అనేవాడుకే జోరుగావుంది మహాజనుల్లో.

"స్వామీ! జైలుకు వెళ్ళడం తప్పా?"

"ఆ—తప్పే!"

"కారణం సెలవిస్తారా?"

"అక్కడ ఆచార వ్యవహారాదులు జరగవు. కాబట్టి ఆ గడపతొక్కడంతోటే మానవుడు అధఃపతితుడై పోతాడు."

"దొంగా—తోడుబోతూ సంగతికాదు మనవిచెయ్యడం. దేశభక్తి ప్రపూరితుడై వెళ్ళేవాడుకూడా పతితుడై పోతాడా?"

"ఆ.... అక్షరాలా! అసలు దేశభక్తి అనే పదాన్ని ముందు ఎక్కణ్ణుంచి సంపాయించారోయ్? ప్రతివాడినోటా అదేమాట! యీపదం వేదాల్లోగాని శాస్త్రాల్లోగాని చూడం. కాబట్టి అలాంటి అవైదిక విషయం వర్జనీయం."

"పోనీండి అది వుండకపోతే కనీసం కల్యాణ శబ్దమైనావుందనుకుంటాను. రామకృష్ణాదులు తమ జీవితమంతా లోకకల్యాణార్థం వినియోగించారని చాలాసార్లు శెలవిచ్చారు. తాము యిదీకూడా దేశకల్యాణమనే అనుకోండి."

"దేశం—దేశం అంటున్నావు. నీ అభిప్రాయం యేవిటి?"

"అంటే యిండియా లేక హిందూదేశమని."

"యీ రొండుపదాలుకూడా అశాస్త్రియమైనవే"

"పోనీండి జంబూ ద్వీపమనుకోండి."

"అలారా దోవకి. యిది యెప్పటికైనా జంబూ ద్వీపమేకాని జంబూ దేశంగాని మరోదేశంగానికాదు. దీంట్లో వంగ, కళింక, కాశ్మీర, కాంభోజాది ఛప్పన్నారు దేశా[illegible] ముద్దజేసి యెవరిష్టం వొచ్చినట్లు వాళ్ళు వ్యవహరించడానికి శాస్త్రం వొప్పదు." రొండోది: వున్నా లోకకల్యాణమనేమాట లోకప్రసిద్ధమేగాని దేశకల్యాణమనేదికూడా పనికిరాందే!"

"వాటి బండపడిరి పోనివ్వండి. యీ ఛప్పన్నారు దేశాలైనా పరాధీనంగా వున్నాయంటారా లేవంటారా? వీటికి స్వాతంత్ర్యం సంపాదించడం మన విధికదా?"

"అసలు నీ స్వతంత్రం యెవడిగ్గావాలి."

యీ జంబూ ద్వీపంలో వుండే ప్రతి వ్యక్తికి"

"నువ్వు పొరబడుతున్నావు జీవికి అసల్లో స్వతంత్రమనేదేలేదు. వాడు సర్వదా పరాధీనుడే! నీవుచెప్పే యితర స్వతంత్ర దేశాల్లో మాత్రం వొకడు తన యిష్టం వొచ్చినట్లు దొంగతనం, ఖూనీచేస్తే క్షమిస్తారా? అలాంటి దేశం యేదైనావుంటే చెప్పు చూదాం? స్వతంత్రమనేదానికి ప్రపంచంలో స్థానమేలేదు."

"అన్యాయం, అత్యాచారం యెక్కడకూడా క్షమింపబడదు. నేచెప్పే స్వతంత్రం అలాంటిదికాదు."

"యిప్పుడు వొస్తున్నావు మార్గానికి! యింకవిను. వుండదగ్గ స్వతంత్రం మనకూ, యితరులకూ వుండనేవుంది. తినడం, తిరగడం, నిద్రించడం, మతకర్మలు వగైరా చేసుకోడం, యివన్నీ నిరాటంకంగా సాగుతూనేవున్నాయి. యింకేం గావాలి? రాజకీయ వ్యవస్త సరిగ్గా వుంచడానికి మాత్రం యెవడో వొకడుంటేచాలు. వాడు స్వీయుడైతేనేం పరుడైతేనేం? మనం 'మన' అని అనుకుంటే అందరూ మనవాళ్ళే అవుతారు. నీలాంటివాళ్ళు అలా అనుకోలేక, లేనిపోని రగడలుపెట్టి దేశాల్ని నానా భీభత్సం పట్టిస్తున్నారు. 'ఫలానా దేశాలు మాత్రం మనవి. అనుకునేబదులు 'లోకమంతామందే' అను[illegible] వొట్టి సంకుచితభావాలవల్లనే యీ స్వపర భేదాలు తగలడుతున్నాయి. దీనికంతకూ వుండాలయ్యావుండాలి, విశాలహృదయమూ, ఔదార్యమూనూ."

"దేశభక్తి అనేమాటా వేదశాస్త్రాల్లో లేదు కాబట్టి దేశస్వాతంత్ర్యం కోసం ప్రయత్నించడమూ, అవసరం కొద్దీ కారాగారానికి వెళ్ళడమూ కూడదంటారు. అంతేనా?"

"ముమ్మాటికీ!"

"అక్కడ ఆచారమూ, నిత్యకర్మానుష్ఠానాలూ జరగవనేగదా తాము తెలివివ్వడం?"

"................?"

"పూర్వం పరశురాముడూ భీష్మ ద్రోణాదులూ కర్మరంగంలోకి దిగి, నిత్యనైమిత్తికాది కర్మలను సైతం లెక్కచెయ్యక కార్యశూరులయ్యారు. కర్మవీరునికి కర్మే ప్రధానంగాని మీరు చెప్పేలాంటివి ముఖ్యంకాదని తోస్తుంది. దీనికేమంటారు?"

"అయ్యో నీకర్మ! కర్మపదానికే అర్థం తెలీదూ చర్చకు వచ్చావు. చాలుచాలు. యింక మూటకట్టండి. శాస్త్రజ్ఞానం యేకోశంలో కూడా లేనివాళ్ళకి యిలా అవకాశం యివ్వడం మాదే పొరపాటు. మాట్లాడే కుక్కను 'యిజ్జా' అంటే "యిజ్జా" అందిట. సరైనవాడు వొస్తే యీవిషయంలో వేదాల్లో మంచీ శాస్త్రాల్లోనించి గుట్టలు గుట్టలుగా వుదాహరణాలుచూపిస్తాను. గ్రహించే యోగ్యుడుండాలి. ముందు కావాలంటే నీకు శాస్త్రజ్ఞానం యెంతవరకుందోచెప్పు. లేదా మర్యాదగా తొలగిపో, అసలు నీలాంటి అవివేకితో మాట్లాడుతూ నా విలువయైన కాలాన్ని పాడుచేసుకున్నందుకు కనీసం యిప్పట్నుంచి నాలుగుజాములైనా మౌనంగా సమాధిలో వుండాలి. దీనికిదే ప్రాయశ్చిత్తం. యికముందు నీలాంటి నాస్తికవాదులకి సభలో ప్రవేశమేలేదు." యిలాంటూ శ్రీవారు ఆవేశంతో లేచారు. వారిమొహం కోపాన్ని వెళ్ళగక్కుతోంది: కళ్ళు యెర్ర రంగుకు తిరిగాయి. పెదిమెలు వొణుకుతున్నాయి. చటచట్లాడుతూ లోనికి దయచేశారు. సభ్యులందరూ కళవళపడి పొయ్యారు, "మహాపరాధం! యిది మంచిగ్గాదు!" అన్నాయి వొక్కసారి కొన్ని వందల నోళ్ళు, కొంతమంది అంగవస్త్రాలు నడిమికి బిగించారు, "పిచ్చుకమీదికి బ్రంహ్మాస్త్రమా! అసలు యిలాంటి మిడిమిడి జ్ఞానంవాళ్ళని ముందు [illegible]ల్నివ్వడం మందే తప్పు, పైగా తిరిగి ముట్టుకొని చేతుల్ని ఆ పవిత్రంచేసుగోడం యెందుకు, వాని అపరాధంతో వాడే నాశనమైపోతాడు." అని వారించారు కొందరు.

వ్యవహారం తప్పి వొచ్చిందనో మరేమో రావుజీ మెల్లిగా జారుకున్నాడు. యింతలో లోపలినుంచి వొహాయన (రికగ్నయిజుడు మనిషి) వొచ్చి హస్త చాలనంతో సహా శాంతంచెప్పి, "శ్రీవారు సమాధిలో ప్రవేశించారు. అందరూ శాంతంగా భజనచేసుకోవచ్చునని శెలవు." అని నిష్క్రమించాడు మహానన గృహంవేపు, కోపం చల్లార్చుకోటానికి మళ్లే.

భక్తి కోపాన్ని తాత్కాలికంగా రసాతలంలోకి తొక్కేసింది. హార్మోనియం హనుమన్న హస్తచాలనం ప్రారంభించాడు. "రాధారమణ—మదనమోహన"తో భజన ప్రారంభమైంది. గజాననుణ్ణి వొక్కప్రాణైనా అనుకున్న పాపానపోలా, పాపం ఆ మహానుభావుడి ఖర్మయేమి కాలిందో! నిజమైన భక్తికి సాధనోత్కారంతో పనేముంది? కాబట్టి అందరూ భగవత్ప్రసాద లబ్ధమైన హస్తాలతోనే చప్పట్లు చరుస్తూ భక్తిలో మగ్నమైపొయ్యారు. నిమిష నిమిషానికి తన్మయత్వం అధికమౌతూ వొచ్చింది. కొందరులేచి తాళవరస ప్రకారం నృత్యం యథాశక్తి ప్రారంభించారు. చాలామంది ముందూ, వెనకా పక్కలా యెవరున్నారోననే బాహ్యజ్ఞానంకూడా లేకుండా ఆవేశంతో తూలిపోసాగారు. మరి కొందరు కూచోనే బుజాలు ఎగరేశారు. యిలా వో అరగంటవరకూ రసవత్తరంగా భజన సాగింది.

యెంతమందో వొచ్చారు, వెళ్లారు. యెంత సేపొచ్చి పూజలనీ, ఆవనీ, యివనీ ద్రవ్యం ఆర్జించడమే కాని వొకరు కాకపోతే వొకరైనా యిలా బ్రహ్మానందం చెయ్యలా, 'వ్రతంచెడ్డా సుఖం దక్కా'లన్నారు గదా" అన్నాయి వెయ్యినోళ్ళు, భజన పూర్తయ్యాక వెళ్ళూతూ.

అయితే వీరు మాత్రం ఖాయిదాగా రాదగ్గ పైకం రాబట్టుకోకుండా వుండటంలా కాని. దానికీ దీనికీ సహస్రాంశంభేదముంది.యిందులోస్వార్థంగాని,స్వోపయోగంగాని యీషణ్మాత్రమూలేదు. యీవిధంగా స్వీకరించకపోతే పాపులగతి యేం గావాలి? వాళ్ళు శాశ్వతంగా నరకకూపంలో పడి పోవాలసిందేనా? వార్ని వుద్ధరించే నిమిత్తమే విధిలేక యిలా శ్రీవారు చెయ్యాలసొచ్చింది. సత్పాత్రలోపడ్డ తృణం గూడా పరంతూ సహస్రగుణమై పాపుల్ని కడతేరుస్తుంది గదా! కిట్టక కిష్టాత్రివు దీన్నే "యీధనంతో స్వర్గమార్గంలో మనవారికందరిగ్గాను మెట్టుకో శేవ్ నిర్మింపబడుతుంద"ని, తనలాంటి వాళ్ళతో చెప్పాడని తర్వాత తెలిసింది. అంతకంటే ఆ బుర్రికు అధికంగా యెన్నడు తోస్తుంది!

రోజులు జరిగిపోతున్నాయి. 'నరమానవుల'కి దేంట్లోకూడా తృప్తినేదిలేదు. శిల్పి తన సర్వశక్తుల్ని వినియోగించి జగన్మోహనంగా చెక్కిన చలవరాతి విగ్రహాన్నిగూడా నూనెతోనూ, గంగ సింధూరంతోనూ రుద్ది విరూపంగా చేసేవరకూ తిన్నతిండి జీర్ణం కాదు. అదేవిధంగా రోజులు జరిగేకొద్దీ గాలిచేష్టలవారూ, బ్రంహ్మ రక్షస్సులవారూ, పిల్లల్లేనివారూ, వుపదేశార్తులూవొచ్చి పడసాగారు. వీళ్ళతో శ్రీవారి నియమనిష్ఠలకు అశాంతి కలిగిందని వేరే చెప్పవలసిన పని లేదు. అయినా శ్రీవారు ఆర్తుల్ని వుద్ధరించడమే ప్రధానాంగంగా పెట్టుకున్నారు కాబట్టి రాత్రింబవళ్ళయినా లెక్కపెట్టక కార్యభారం వహించసాగారు.

తరించే మార్గం చూపించమని చాలా మంది ప్రాయోపవేశంపట్టారు. కాని దానికెంతో నియమనిష్ఠలు కావాలి; యోగ్యత కావాలి; పునశ్చరణచేసే శక్తికావాలి. వొట్టినే లభిస్తుందా? యివన్నీ యిలా వుండగా

పూర్వసంచితం వొకటుండాలి. దానికి యీ జన్మలోని కాలకర్మ సంయోగం కలిసిరావాలి. యివన్నీ కోయిన్సైడై తేనేగాని తారక మార్గం దొరకదు.

శ్రీవారికి శిష్యకోటి అంతాసమానమే. కాని సేవా—శుశ్రూషలవల్లనై తేనేం యితర క్వాలిఫికేషన్లవల్ల నై తేనేం వొక్కోవ్యక్తి ముందుమిగిలి, ముఖ్య శిష్యస్థానాన్ని ఆక్రమించి తరిస్తుంది. అలానే బాబూరావు దంపతులు యిక్కడ సఫలమనోరథు లయ్యారు.

బుద్ధి అన్నిట్లో చురుగ్గావున్నా, అనూచాన సాంప్రదాయంకాదు గాబట్టి కాసంత సాధన అధికంగా చెయ్యాలసొచ్చింది. అంచేత శ్రీమతి యేకాంతసేవలో వొక్కోసారి గంటల తరబడి సాధనలో వుండి పొయ్యేది. ఆమెగారి అదృష్టాన్నిచూచి యెంతమందో గుటకలుమింగారు; యెందరో సహించలేక లోలో కుమిలి కుమిలి పొయ్యారు.

చాలాకాలం గడిచింది. కారణాంతరం వల్ల శ్రీవారు టూరు ప్రోగ్రామును తాత్కాలికంగా క్యాన్సలు చేసుకొని, స్వస్థానానికి ప్రయాణభేరీవేశారు. వూరూ వుహామూ శ్రీవారి వియోగానికి విలవిల్లాడింది "మావంటివారికి వొకేస్థానమంటూలేదు. నేను యేర్పాటుచేసిన చిహ్నాలని శాశ్వతంగా వుండేట్టు చెయ్యడమే నన్ను గౌరవించడం. విచారించకండి," అని సాంత్వనవచనాలు చెప్పారు శ్రీవారు.

నాడు అష్టమి. శ్రీవారువెళ్ళి వారం దాటింది. తెలతెలవారుతూంది. అకస్మాత్తుగా శ్రీమతి కనపడ్డంలేదనే పుకారు బయలుదేరింది. లోకులు నానాదిక్కులా పరుగెత్తారు; బావులూ చెరువులూ గాలించారు. 'పత్తా' దొరకలా. దక్షిణంవేపుగా పోయిందనీ, అదంతా గాలిచేష్టేగాని మరోటికాదనీ, పట్టితెస్తే బాగుచేస్తానని చెప్పింది చెంచి, గద్దెలో. ప్రాణభయం మాత్రంలేదనీ, ఫలానా వేపు వున్నతపథంమీద వుందనీ, లగ్నం ద్వాదశి కాబట్టి ఆట్టే ప్రయత్నాలతో పని లేదని, వొస్తే శతవిధాల గ్రహం ఫిరాయించడంతోటే వొస్తుందనీ చెప్పాడు చర సిద్ధాంతి.

సంవత్సరమూ గడిచింది. జాడలా, వొట్టి చెవులు కొరుక్కునే నిరాధార గాలి రహస్యాలు తప్ప. "మంత్రబలంతో సశరీరంగా తరించింది మహాతల్లి" అంటూ తన దురదృష్టాన్ని నిందించుకుంది వొహావిడ. మంత్రం బాగా పంజేసింది. కలిలో మంత్రాలకి బలంలేదంటారు. పునశ్చరణ చాతగాక నాయినమ్మలు" అన్నాడు వొహాయన.

యేది యెలావున్నా శ్రీవారు శంకుస్థాపనచేసిన భజనసమావేశం మాత్రం వారు కోరినవిధంగా భజన్లతోనూ, పానక వందేరాలతోనూ, పటికిబెల్లాలతోనూ, పంచకజ్జాయాలతోనూ నిరాటంకంగా పరిమళించిపోతూంది నానాటికీ. ఆమధ్య వూళ్ళోలేనప్పుడు నారదులవారు సాక్షాత్కరించి యమలోకమార్గం పాడుపడ్డదనీ, ఆలోకపు యజమానిగుండెల్లో రాయిపడ్డిదనీ, తత్కారణంగా విన్ననే బ్రంహ్మలోకానికి పరుగెత్తాడనీ, అవసరసమావేశం తిప్పదు కాబట్టి తానూగూడా వెళుతున్నాననీ చెప్పివెళ్ళినట్లు కుంతాగ్రేసర్లు పుకారువేసారు. కసిపోక మశి పూసుకున్నవిధంగా.

*    *    *

యింటిపని ఆదరా బాదరా ముగించి సమావేశమందిరంవేపు పేరెం పారుతూంది తులశమ్మ. మృత్యుంజయుడు తాత అరుగు మీద కూచోని చూచాడు. మూంచి కుచోద్యం మనిషిలెండి! పైగా వరసకూడా వొచ్చి పడ్డది! యేమేయ్ అమ్మీ! యెక్కడికీ— ఆ వెళ్ళడం?" అని ప్రశ్నించాడు.

(నడుస్తూనే) "యెక్కడికిలేదు తాతా—భక్త సమావేశానికి."

"యేవిటీ? నాకు బాగా వినపడ్డంలేదే! కొంచెం నేత్రావరోధంలే. యేదీ—మళ్ళా చెప్పూ—ఎక్కడికీ?"

(పెద్దగా) "భక్త సమావేశానికీ—"
(లోలో) "పాడుబండచెవుదు."

"యేవిటో చెవిటిగోడులే మ్మీ— సరిగా వినబడదూ. యేమన్నావూ—భర్త—భర్త భర్తృ సమాగమానికా?—అదే కదూ నీవందీ? సరే—మంచిపనే, వెళ్ళిరా. యేదో అడిగాలే అమ్మీ, అన్యథా అనుకోవాకు!

అన్నాడు ముశిముశి నవ్వునవ్వుతూ.

